## వేములవాడ-అరుణాచలం.. ప్రత్యేక బస్సు

**కరీంనగర్ ఆర్ఎం ఎస్ సుచరిత**



మాట్లాడుతున్న ఆర్ఎం సుచరిత

తెలంగాణ చౌక్, జూలై 7 : గురు పౌర్ణమి సందర్భంగా భక్తుల సౌకర్యార్థం కరీంనగర్ రీజియన్ పరిధిలోని వేములవాడ డిపో నుంచి తమిళనాడులోని అరుణాచలం పుణ్యక్షేత్రానికి ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సు ఏర్పాటు చేసినట్లు రీజినల్ మేనేజర్ ఎస్ సుచిరిత తెలిపారు. ఈ నెల 19న శుక్రవారం రాత్రి 8 గంటలకు వేములవాడలో బయలుదేరి అదే రోజు రాత్రి 9 గంటలకు కరీంనగర్ చేరి, ఇక్కడి నుంచి 20న రాత్రి 8 గంటలకు అరుణాచలం చేరుకుంటుందన్నారు. గిరి ప్రదక్షిణ అనంతరం ఈ నెల 21 సాయంత్రం 5 గంటలకు తిరుగు ప్రయాణమై ఈ నెల 22 సాయంత్రం 6 గంటలకు కరీంనగర్‌కు చేరుకుంటుందన్నారు. పెద్దలకు రూ.4500, పిల్లలకు, రూ.3800లు చార్జీగా నిర్ణయించినట్లు తెలిపారు. ముందస్తు రిజర్వేషన్‌కు టీఎస్ ఆర్టీసీ వెబ్‌సైట్‌లోని సర్వీస్ నెంబర్ 75555ను ఎంపిక చేసుకోవాలని సూచించారు.

# నెల రోజులు.. 72 ట్రాన్స్‌ఫార్మర్లు

**మరమ్మతుల కోసం సబ్ స్టేషన్లకు తెచ్చిన గంగాధర మండల రైతులు**

- లూజ్‌వైర్లు, లోవోల్టేజీ అని చెప్పిన డీఈ
- పిడుగు పడి కాలిపోయాయన్న ఏఈ
- కరెంటు సరిగా లేక అన్నదాతల పాట్లు
- వరి నార్లను కాపాడుకునేందుకు తిప్పలు



### మూడు సార్లు కాలిపోయింది

మా బూరుగుపల్లిలో ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ తరచూ కాలిపోతున్నది. పదిహేను రోజుల క్రితం కాలిపోతె బస్టాండ్ ఏరియాలో నాలుగు గంటల పాటు కరెంటు పోయింది. ఇప్పటికే మూడు సార్లు రిపేర్ చేసి బిగిస్తే మూడు సార్లు కాలిపోయింది. పనుల్లో నాణ్యత లోపంతోనే ఇలా జరిగుతోంది.

**- గడ్డం స్వామి, రైతు (బూరుగుపల్లి)**




గత నెలలో బూరుగుపల్లిలో కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్‌ను తీసుకెళ్తున్న రైతులు, సిబ్బంది(ఫైల్)



మరమ్మతుల కోసం గంగాధర విద్యుత్ సబ్ స్టేషన్‌కు రైతుల తీసుకువచ్చిన ట్రాన్స్‌ఫార్మర్లు

**అసలే వర్షాలు లేక ఆకాశం వైపు ఆశగా చూస్తున్న అన్నదాత, పోసిన వరి నార్లు కాపాడుకోవడానికి అష్టకష్టాలు పడాల్సి వస్తున్నది. బావులు, బోర్లలో ఉన్న కొద్ది పాటి నీటితోనైనా దక్కించుకోవాలని చూస్తే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయి అసలుకే మోసం జరుగుతున్నది. గంగాధర మండలంలో ఒకే నెలలోనే 72 ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోవడం సమస్య తీవ్రతకు అద్దం పడుతున్నది.**

గంగాధర, జూలై 7 : గంగాధర మండలకేంద్రంతో పాటు ఆచంపల్లిలో విద్యుత్ సబ్ డివిజన్లు ఉన్నాయి. కాగా, జూన్‌లో గంగాధర సబ్ డివిజన్ పరిధిలో 48, ఆచంపల్లి సబ్ డివిజన్ పరిధిలో 24 ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయాయి. లైన్లలో లోపం, లూజ్ వైర్లు, లోవోల్టేజీ, పిడుగుల పడి, గాలి దుమారం వంటి సమస్యలతో నెల వ్యవధిలోనే రెండింటి పరిధిలో 72 ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయినట్లు విద్యుత్‌శాఖ అధికారులు చెబుతున్నారు. అయితే ట్రాన్స్‌ఫార్మర్లలో మరమ్మతులో నాణ్యత పాటించకపోవడంతోనే బిగించిన నాలుగు రోజుల్లోనే మళ్లీ కాలిపోతున్నాయని రైతులు వాపోతున్నారు. రోజుల తరబడి కార్యాలయం చుట్టూ తిరిగినా మరమ్మతులకు నోచుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఆన్‌లైన్‌లో నమోదు చేసిన తర్వాత 48 గంటల్లోగా ట్రాన్స్‌ఫార్మర్లకు మరమ్మతులు చేయించి బిగించాల్సి ఉండగా.. పదిహేను రోజులైనా మరమ్మతులు చేయడం లేదని ఆవేదన చెందుతున్నారు.

### అధికారుల తలోమాట

ఒకే నెలలో 72 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోవడంపై విద్యుత్ శాఖ అధికారులు తలోమాట మాట్లాడుతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోవడానికి 80 శాతం లూజ్ వైర్లు, లోవోల్టేజీ అని విద్యుత్ శాఖ డీఈ కాళిదాసు తెలిపారు. వానకాలంలో పిడుగులు పడడం, గాలిదుమారంతోనే ఎక్కువగా కాలిపోతున్నాయని ఏఈ తిరుపతి చెప్పారు. విద్యుత్ సమస్యలపై ఇద్దరు అధికారులు వేర్వేరు సమాధానాలు చెప్పడం నిర్లక్ష్యానికి అద్దం పడుతున్నదని రైతులు ఆరోపిస్తున్నారు.

### నాలుగు రోజులకే మళ్లీ పోయింది



విద్యుత్ శాఖ సిబ్బంది నిర్లక్ష్యంతో మేం తీవ్ర ఇబ్బంది పడుతున్నం. ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోతే ఎన్నిసార్లు చెప్పినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నరు. మేమే సొంత ఖర్చుతో గంగాధరకు తీసుకెళ్లి రిపేర్ చేయించుకుంటున్నం. నాణ్యతా లోపంతో నాలుగు రోజులకే మళ్లీ కాలిపోతున్నది. దీంతో పంటలను కాపాడుకోవడానికి ఇబ్బంది పడుతున్నం.

**- జుర్రు రవి, రైతు (లింగంపల్లి)**

### లూజ్ వైర్లతోనే కాలిపోతున్నాయి

80 శాతం లూజ్‌వైర్లు, లోవోల్టేజీతోనే జూన్‌లో ట్రాన్స్‌ఫార్మర్లలో కాలిపోయాయి. మిగిలిన 20 శాతం పిడుగులు, ఇతర కారణాలతో కాలిపోయాయి. ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయి ఆన్‌లైన్‌లో నమోదు చేసిన తర్వాత టౌన్‌లో అయితే 24 గంటల్లో, గ్రామీణ ప్రాంతాల్లో అయితే 48 గంటల్లో మరమ్మతులు చేస్తాం. పనుల్లో నాణ్యతా లోపం ఏమీ లేదు.

**- కాళిదాసు, డీఈ**



మాజీ ఎంపీ వినోద్ కుమార్‌ను సన్మానిస్తున్న, ప్రజాప్రతినిధులు, నాయకులు

# పదవులు శాశ్వతం కాదు

**రాజకీయంగా ప్రతి ఒక్కరూ పోటీలో ఉండాలి**

- ఇచ్చిన హామీలను కాంగ్రెస్ నెరవేర్చాలి
- మాజీ ఎంపీ వినోద్ కుమార్

మానకొండూర్ రూరల్, జూలై 7 : పదవులు శాశ్వతం కాదనీ, రాజకీయంగా ప్రతి ఒక్కరూ పోటీలో ఉండాలని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ సూచించారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కరీంనగర్ జిల్లా లో ఇటీవల పదవీ కాలం పూర్తి చేసుకున్న ఎంపీపీ, జడ్పీటీసీ సభ్యులకు ఆత్మీయ వీడ్కోలు సమావేశాన్ని ఆదివారం మానకొండూర్ బీఆర్ఎస్ కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు ఆధ్వర్యంలో నిర్వహించగా కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌తో కలిసి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వినోద్‌కుమార్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రాన్ని తాము అన్ని విధాలా అభివృద్ధి చేశామని గుర్తు చేశారు. పార్టీలో ఉన్నవారందరూ కలిసికట్టుగా పని చేయాలని సూచించారు. రానున్న రోజుల్లో యువతకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలని కేసీఆర్‌కు సైతం సూచించినట్లు గుర్తు చేశారు. వచ్చే ఐదేళ్ల తరువాత ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 13 స్థానాల్లో గులాబీ జెండాను ఎగురవేస్తామనీ, కేసీఆర్ నాయకత్వాన ప్రతి ఒక్కరూ కలిసి కట్టుగా పని చేయాలని కోరారు. 33 శాతం మహిళా రిజర్వేషన్లు వస్తే మహిళలకు అవకాశాలు వస్తాయని, ఇప్పుడు తాము తయారు చేసిన నాయకత్వంతో అవకాశాలను అందిపుచ్చుకుంటారని మహిళలకు సూచించారు. తాము ప్రతి పక్షంలో ఉన్నా నిద్రపోమని, బలమైన రాజకీయ శక్తిగా అవతరిస్తామని స్పష్టం చేశారు.

### నాటి మోదీ తీరు నేడు లేదు..

ఆనాటి ప్రధాని మోదీ తీరు ప్రస్తుతం లేదని, ప్రాంతీయ పార్టీలకు మనుగడే లేదన్న ఆయన నేడు ఆ ప్రాంతీయ పార్టీల సంకనే చేరారని వినోద్‌కుమార్ ఎద్దేవా చేశారు. ఆ ప్రాంతీయ పార్టీల నాయకులైన పవన్, చిరంజీవి వద్దకు వచ్చి చేయి కలిపిన విషయాన్ని గుర్తు చేశారు. నాడు పులిలా ఉన్న మోదీ నేడు పిల్లిలా తయారయ్యారని తెలిపారు. ప్రాంతీయ భాషల మనుగడను దెబ్బ తీసేలా కొత్త చట్టాలకు హిందీ భాషను అనుసంధానం చేస్తున్నారని, ఈ విషయమై కోర్టులో పిటిషన్ దాఖలు చేయనున్నట్లు వివరించారు. రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఉమ్మడి సమస్యల విషయమై భేటీ అయ్యి ఏం సాధించారని ప్రశ్నించారు. కమిటీ వేశామని అంటున్నారని, అలాంటి కమిటీలు బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు వేయలేదా? అని గుర్తు చేశారు. ''రాష్ట్రంలో బీఆర్ఎస్ నక్కలా కాచుకొని ఉందని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ అంటున్నారు.. బిడ్డా.. నక్కలా కాదు.. పులిలా ఉన్నాం'' అని వినోద్ కుమార్ హెచ్చరించారు. భవిష్యత్తులో కేసీఆర్ నాయకత్వంలో పూర్తి స్థాయిలో పని చేయాలని నాయకులను కోరారు. అనంతరం పదవులు పూర్తి చేసుకున్న జడ్పీటీసీ, ఎంపీపీ సభ్యులకు మెమోంటోలు అందజేసి, శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు రసమయి బాలకిషన్, సుంకె రవిశంకర్, వొడితెల సతీశ్‌కుమార్; మాజీ ఎమ్మెల్సీ నారాదాసు లక్ష్మణ్‌రావు, కరీంనగర్ మేయర్ వై సునీల్‌రావు, మాజీ జడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ, వైస్ చైర్మన్ గోపాల్‌రావు, మాజీ మేయర్ సర్దార్ రవీందర్‌సింగ్, నాయకులు గెల్లు శ్రీనివాస్ యాదవ్, రూప్‌సింగ్, బీఆర్ఎస్ కరీంనగర్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి శేఖర్ రావు, వివిధ మండలాల బీఆర్ఎస్ అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

### కేడర్‌కు అండగా నిలవాలి



పదవీ విరమణ పొందుతున్న ఎంపీపీ, జడ్పీటీసీ సభ్యులు రానున్న రోజుల్లో మంచి పదవులను ఆశించాలి. పార్టీ కోసం నాయకులు పని చేయాలి. ప్రజలు ఎక్కువగా పనులు చేయించుకునేందుకు ప్రతి పక్షాల దగ్గరకే వస్తారు. ఇలాంటి పనులు చేస్తున్న సందర్భాల్లో కేడర్‌కు అనేక సమస్యలు వస్తాయి. వారికి అండగా నిలవాలి. నీళ్ల లేక అనేక డ్యాములు ఎండిపోయాయి. రైతులు అవస్థలు పడుతున్నారు. వారికి అండగా నిలవాల్సిన సమయం ఆసన్నమైంది. యువతకు పెద్దపీట వేస్తాం. కరీంనగర్ జిల్లా అంటే కేసీఆర్‌కు ఇష్టం. ప్రతి ఒక్కరూ కష్టపడి పని చేయాలి. ప్రజలకు హామీలిచ్చిన కాంగ్రెస్ పార్టీ ఫిరాయింపులకు పెద్ద పీట వేస్తున్నది. ఆనాడు వైస్రాయ్ హోటల్లో చంద్రబాబు ఆడిన నాటకాన్నే నేడు కాంగ్రెస్ చేస్తున్నది. ఒక్కరు పోతే పార్టీ ఎప్పుడూ డీలా కాదు. ప్రజల వెంబడి ఉండాలనే లక్ష్యంతో ముందుకెళ్లాలి. రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించదు. కుల గణన, జన గణన అంటూ దాటవేస్తున్నది. పదవులకు మాత్రమే వీడ్కోలు కానీ, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాం.

**- గంగుల కమలాకర్, కరీంనగర్ ఎమ్మెల్యే**

### గాలికి గడ్డి పోచలే పోతాయి



గాలికి గడ్డి పోచలే పోతాయి.. కానీ, గడ్డపారలాంటి కార్యకర్తలు పోరు. బీఆర్ఎస్ హయాంలో అనేక సంక్షేమ ఫలాలు ప్రజలకు అందించాం. పార్టీకి ద్రోహం చేసిన వాళ్లు పోతారు. వాళ్లు పోతేనేం గడ్డపారలాంటి కార్యకర్తలను తయారు చేసుకునే సత్తా బీఆర్ఎస్ పార్టీకి ఉన్నది. కేసీఆర్ నాయకత్వంలో ప్రతి ఒక్కరూ పని చేయాలి.

**- జీవీ రామకృష్ణారావు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు**

## కొండగట్టు, ఇల్లందకుంట ఆలయాలను అభివృద్ధి చేస్తా

- వేములవాడ ఆలయాన్ని ప్రసాద్‌స్కీంలో చేర్చుతా
- కరీంనగర్‌లో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్



మాట్లాడుతున్న కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్

విద్యానగర్, జూలై 7: కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని ఇల్లందకుంట, కొండగట్టు ఆలయాలను రామాయణ సర్క్యూట్ కింద అభివృద్ధి చేసేందుకు కృషిచేస్తానని కరీంనగర్‌లో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ పేర్కొన్నారు. వేములవాడ రాజన్న ఆలయాన్ని ప్రసాద్ స్కీంలో చేర్చుతామన్నారు. కరీంనగర్– హసన్‌పర్తి రైల్వేలైన్ సాధ్యాసాధ్యాలపై రూ.20 కోట్లతో చేపట్టిన సర్వే పనులు పూర్తయ్యాయన్నారు. ఈ లైన్ వస్తే ఈ ప్రాంతం ఎంతో అ భివృద్ధి చెందుతుందని చెప్పారు. ఆదివారం కరీంనగర్‌లోని ఎంపీ కార్యాలయంలో బండి సంజయ్ మీడియాతో ఇష్టాగోష్టిగా ముచ్చటించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఒక్కరు అడగడం వల్లే స్మార్ట్ సిటీల గ డువు పెంచలేదని, ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులు సైతం గడువు పెంచాలని కోరడంతోనే దేశంలోని పొడిగింపు వచ్చిందని వెల్లడించారు. కాగా, గడువు పొడిగింపుతో కరీంనగర్ కార్పొరేషన్‌కు మరి న్ని నిధులు వచ్చే అవకాశముందని చెప్పారు. ఇక బీజేపీ స్టేట్ ప్రెసిడెంట్ ఎంపిక అంశం పార్టీ జాతీయ నాయకత్వం చూసుకుంటుందని, ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా ఎవరిని అధ్యక్షుడిని చేయాలనే దానిపై ఆలోచించి అడుగు వేస్తుందని చెప్పారు. త్వరలో పార్టీ ప్రెసిడెంట్‌ని అధిష్టానం ప్రకటిస్తుందన్నారు.

### ఆత్మహత్యకు కారకులైన ఐదుగురిపై కేసు

ఓదెల, జూలై 7: జీలకుంట గ్రామంలో వంగల శ్రీకాంత్‌రెడ్డి (36) ఆత్మహత్య చేసుకునేందుకు కారకులైన ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు పొత్కపల్లి ఎస్ఐ అశోక్‌రెడ్డి తెలిపారు. భూతగాదాల విషయంలో బెదిరింపులకు పాల్పడడం వల్ల తన కొడుకు ఆత్మహత్య చేసుకున్నట్లు అతని తల్లి సుజాత ఇచ్చిన ఫిర్యాదు మేరకు అదే గ్రామానికి చెందిన గొట్టి యశోద, నాగరాజు, స్రవంతి, దండు సమ్మయ్య, రౌతు మనోజ్‌క్రాంతివీర్‌పై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

# మళ్లీ ఉప్పెనలా వస్తాం

- పైరవీకారులే కండువాలు మారుస్తున్నరు
- వాళ్లతో అయ్యేదేం లేదు.. పార్టీకి నష్టం లేదు
- మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్
- పెద్దపల్లిలో తాజా మాజీ ప్రజాప్రతినిధులకు ఆత్మీయ సన్మానం

**భవిష్యత్ అంతా మనదే.. ఎవరూ అధైర్య పడొద్దు**




మాట్లాడుతున్న మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

పెద్దపల్లి, జూలై 7: 'తెల్లారితే బతుకుదెరువు ఉండనోళ్లు. పైరవీకారులు, రాజకీయ బ్రోకర్లు మాత్రమే పార్టీ మారుతున్నారు తప్ప, నికార్సయిన కార్యకర్తలు, నాయకులు పార్టీ మారడం లేదు. కొంత మంది పోయినంత మాత్రాన బీఆర్ఎస్‌కు నష్టం లేదు. వాళ్లతో అయ్యేది లేదు.. పోయేది లేదు. ఉద్యమ టైంలో మనం ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొన్నాం. కలబడి నిలబడి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించుకున్నాం. పదేళ్లు ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం పాటు పడింది మ న బీఆర్ఎస్ పార్టీ. ఇప్పుడు తాత్కాలిక బ్రేక్ పడింది. భవిష్యత్ మనదే. మళ్లీ బీఆర్ఎస్ వస్తుందని, ఉప్పెనలా వస్తామని' మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ పేర్కొన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ భవన్‌లో పెద్దపల్లి నియోజకవర్గంలో ఇటీవల పదవీకాలం పూర్తయిన బీఆర్ఎస్ ఎంపీపీలు, వైస్ ఎంపీపీ లు, జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మార్కెట్ చైర్మన్లకు మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి మనోహర్‌రెడ్డి సన్మాన కార్యక్రమం నిర్వహించారు. దీనికి బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్‌తో కలిసి మాజీ మంత్రి హాజరై, మాట్లాడారు. ప్రజల మధ్యలో ఉంటూ ప్రజా సేవ చేస్తే ప్రజలే మళ్లీ మనకు పట్టం గడుతారన్నారు. తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ పదేళ్ల పాలన స్వర్ణయుగమని కొనియాడారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు నిత్యం జనంలోనే ఉండాలని, కాంగ్రెస్ నాయకుల, ప్రభుత్వ తప్పులను ఎప్పటికప్పుడు ఎండగట్టాలని పిలుపునిచ్చారు. పోచారం శ్రీనివాస్‌రెడ్డి, కడియం శ్రీహరి అధికార దాహంతో పార్టీ మా రారని, అలాంటి వారిని ప్రజలు సైలెంట్‌గా గమనిస్తున్నారని, సమయం వచ్చినప్పుడు బుద్ధి చెప్తుతారని పేర్కొన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రఘువీర్ సింగ్, తాజా మాజీ ఎంపీపీలు బండారి స్రవంతి శ్రీనివాస్, నూనేటి సంపత్, బాలాజీరావు, తానిపర్తి స్రవంతి మోహన్ రావు, రమాదేవి రామ్‌గోపాల్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ రాములు, బీఆర్ఎస్ పట్టణాధ్యాక్షుడు రాజ్‌కుమార్, నాయకులు లక్ష్మణ్, దాసరి ఉష, రాములు, అంజయ్య, సతీష్, వాసు ఉన్నారు.

### ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి..



నేను ఓ సామాన్య కార్యకర్తగా ఈశ్వర్ అన్న సమక్షంలో ఆనాడు బీఆర్ఎస్‌లో చేరా. ఉద్యమంలో చురుగ్గా పని చేశా. రామగుండం ఎమ్మెల్యేగా నన్ను అదృష్టం వరించింది. అధికా రం, పదవులు శాశ్వతం కాదు. నిబద్ధత ప్రజాసేవ చేయడం ద్వారా వచ్చే గుర్తింపే శాశ్వతం. ప్రజాప్రతినిధిగా గెలుపొందడమే గొప్ప అదృష్టం. అలాంటి అవకాశాన్ని కేసీఆర్ కల్పించారు. అలవికానీ హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను బీఆర్ఎస్ శ్రేణులు ఎక్కడికక్కడ తిప్పికొట్టాలి. అలాంటప్పుడే మళ్లీ మనం ప్రజా ప్రతినిధిగా ఎన్నుకోబడుతాం.

**- కోరుకంటి చందర్, బీఆర్ఎస్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు**

### గ్యారెంటీలు అమలు చేసే దాకా పోరాటం..



రెండు పర్యాయాలు పెద్దపల్లి ఎమ్మెల్యేగా గెలిపించేందుకు కృషి చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు. నియోజకవర్గంలో బీఆర్ఎస్‌ను మరింత బలోపేతం చేసేందుకు కృషి చేయాలి. బీఆర్ఎస్ మనకు ప్రజా ప్రతినిధిగా గుర్తింపునిచ్చింది. నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి ఉంటూ చివరి రక్తపు బొట్టు వరకు పార్టీ పటిష్టత కోసం పని చేయాలి. పార్టీ మారితే ఉన్న విలువ పోగొట్టుకునుడే తప్ప ఏమీ ఉండదు. ప్రజా ప్రతినిధిగా ఎక్కడో చిన్న చిన్న పొరపాట్లు చేసి ఉంటాం. వాటిని సవరించుకొని ప్రజలతో మమేకమై సమాజ హితం కోసం పని చేయాలి. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీలు అమలు చేసే దాకా బీఆర్ఎస్ శ్రేణులు రాజీలేని పోరాటం చేయాలి.

**- దాసరి మనోహర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే, పెద్దపల్లి**

## దరఖాస్తుల ఆహ్వానం

కరీంనగర్ కలెక్టరేట్, జూలై 7 : అత్యంత ప్రతిభా పాటవాలు ప్రదర్శించే బాలలకు అందించే రాష్ట్రీయ బాలపురస్కార్ అవార్డులకు మహిళా, శిశు సంక్షేమ శాఖ దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. 5 నుంచి 18 ఏళ్ళలోపు బాలలు క్రీడలు, పర్యావరణ పరిరక్షణ, ఆర్ట్స్, కల్చరల్, సైన్స్, టెక్నాలజీ విభాగాల్లో అత్యుత్తమ విజయాలు సాధించిన వారు ఈ అవార్డుల కోసం ఈ నెల 31లోపు http://awards.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తులు చేసుకోవాలని మహిళా, శిశు సంక్షేమ శాఖ కార్యాలయ వర్గాలు తెలిపాయి. కేంద్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అందజేసే ఈ అవార్డులకు ఎంపికైన వారికి జనవరి 2025లో రాష్ట్రపతితో అందించనున్నట్లు ఆ శాఖ అధికారులు ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

# ప్రగతి పరుగులు పెట్టేనా?

- జిల్లాలో పడకేసిన అభివృద్ధి
- తంగళ్లపల్లిలో నత్త నడకన రైల్వే, కేవీ పనులు
- సమస్యల్లో టెక్స్‌టైల్ పార్క్
- నేడు మండల కేంద్రంలో కేంద్ర మంత్రి బండి పర్యటన



కొనసాగుతున్న రైల్వే లైన్ పనులు

సిరిసిల్ల రూరల్, జూలై 7: అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నామని గొప్పలు చెప్పుకునే కేంద్రం, జిల్లాలోని ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేస్తున్నది. పనులు ప్రారంభమై ఏండ్లు గడుస్తున్నా.. అధికారుల నిర్లక్ష్యం, పట్టింపులేమితో ఏ ఒక్కటీ పూర్తికాని పరిస్థితి నెలకొన్నది. ఇందుకు తంగళ్లపల్లి మండలమే నిదర్శనంగా నిలుస్తున్నది. వివరాల్లోకి వెళితే.. ఎన్డీయే హయాంలో ప్రారంభించిన తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లి శివారులోని టెక్స్‌టైల్ పార్క్ సమస్యల వలయంలో ఉన్నది. కోరుట్ల–వేములవాడ–సిరిసిల్ల–సిద్దిపేట రహదారి మంజూరైన, ఇంకా పనులు ప్రారంభంకాలేదు. ఇక పోతే నాడు ఎంపీగా ఉన్న కేసీఆర్ ప్రత్యేక చొరవతో మంజూరైన కొత్తపల్లి–మనోహరాబాద్ రైల్వే లైన్ పనులు సిద్దిపేట వరకు పూర్తయి ప్రారంభమైన విషయం తెలిసిందే. కానీ సిద్దిపేట–సిరిసిల్ల రైల్వే లైన్ నత్తనడకన కొనసాగుతున్నది. ఇకపోతే అప్పటి ఎంపీ వినోద్‌కుమార్ ప్రత్యేక చొరవతో కేంద్రియ విద్యాలయం మంజూరు కాగా, గతేడాది మాజీ మంత్రి కేటీఆర్ ప్రత్యేక చొరవతో పద్మనగర్ శివారులోని పనులు ప్రారంభించారు. తుది దశకు చేరినప్పటికీ ఇప్పటికీ ప్రారంభంకాలేదు. కరీంనగర్ ఎంపీగా రెండోసారి ఎన్నికై, కేంద్ర మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన బండి సంజయ్ దృష్టి సారించాలని, త్వరగా అందుబాటులోకి తేవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

### టెక్స్‌టైల్ పార్క్ ముఖం చూడని బండి సంజయ్..

తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లిలోని టెక్స్‌టైల్ పార్క్‌ను 2002లో నాటి ఎన్డీయే సర్కారు ఏర్పాటు చేసింది. తర్వాత వచ్చిన యూపీఏ సర్కారు గాలి కొదిలేయగా, మళ్లీ 2014లో పవర్‌లోకి వచ్చిన బీజేపీ సర్కారు కూడా పట్టించుకోలేదు. పలుమార్లు మాజీ మంత్రి కేటీఆర్, మాజీ ఎంపీ వినోద్‌కుమార్ టెక్స్‌టైల్‌పార్క్ అభివృద్ధికి సహకరించాలని విన్నవించినా స్పందించలేదు. మెగా టెక్స్‌టైల్ జోన్, కామన్ ఫెసిలిటి సెంటర్, శిక్షణ కేంద్రం, పరిశ్రమల ఏర్పాటుకు ప్రోత్సాహకాలు అందివ్వాలని కోరినా ఫలితం లేకపోయింది. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతోనే నెట్టుకొస్తున్నారు. టెక్స్‌టైల్ రంగం కేంద్ర ప్రభుత్వ పరిధిలో ప్రత్యేక శాఖ ఉన్నప్పటికీ పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ఇక కరీంనగర్ ఎంపీగా రెండుసార్లు గెలిచిన బండి సంజయ్‌కుమార్ ఏనాడూ టెక్స్‌టైల్‌పార్క్‌ను సందర్శించలేదు. బీఆర్ఎస్ హయాంలో మాజీ మంత్రి కేటీఆర్ ప్రత్యేక చొరవతో రాష్ట్ర ప్రభుత్వం తరుపున ఆర్డర్లు అందించి, కార్మికులకు ఉపాధి కల్పించారు. కానీ కొత్త సర్కారు పట్టింపులేమితో ఆరు నెలలుగా కార్మికులు ఉపాధి లేక ఆగమవుతున్నారు. అయితే సోమవారం తంగళ్లపల్లి మండల కేంద్రంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ పర్యటించనుండగా, ఇక్కడి ప్రజలు ఆయనపై ఆశలు పెట్టుకున్నారు. సమస్యలపై బండి సంజయ్ దృష్టి సారించి, త్వరగా పరిష్కరించాలని కోరుతున్నారు.


- జన్మదిన శుభాకాంక్షలు
- పొలిటికల్
- స్వదేశాగమనం
- లీగల్ ప్రకటనలు
- క్లాసిఫైడ్స్
- పదవీ విరమణ
- ప్రారంభోత్సవం
- శ్రద్ధాంజలి
- సినిమా
- వివాహ మహోత్సవం
- షష్టిపూర్తి మహోత్సవం మరియు
- అన్ని శుభకార్యాలు

నమస్తే తెలంగాణ
మన రాష్ట్రం.. మన పత్రిక...

నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రకటనల కోసం సంప్రదించండి..



ప్రకటనల విభాగం...
సెల్: 9182 777 571